సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



బంగారు కవచం బహూకరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని లక్ష్మీనారాయణ స్వామికి బంగారు కవచాన్ని జయశ్రీ అనే భక్తురాలు అందజేశారు.



జగనన్నను మళ్లీ సీఎంని చేద్దాం

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేద్దామని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
పాడేరు, అరకు	6.14	4.34
రంపచోడవరం	6.28	4.41

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఇబ్బందులు లేకుండా చర్యలు

- సీఈవో ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సమీక్షించారు. వృద్ధులు,విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కు వినియోగంపైన ఆయన ఆదేశాలిచ్చారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, జేసీ భావన వశిష్ఠ్, ఎస్‌డీసీ అంబేడ్కర్ జిల్లాలోని పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి తీసుకున్న చర్యలను వివరించారు.

పోలీస్ స్టేషన్‌లో నూతన భవనాలు ప్రారంభం



నూతన భవనాలను ప్రారంభిస్తున్న రంపచోడవరం ఏఎస్‌పీ జగదీష్ అడహళ్లి

వై.రామవరం: స్థానిక పోలీసు స్టేషన్‌లో నిర్మించిన బేరక్, గెస్ట్‌హౌస్ నూతన భవనాలను సోమవారం రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బందోబస్తులో పాల్గొనేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చే అదనపు బలగాల కోసం ఈ భవనాలను నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్, అదనపు ఎస్‌ఐ కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి డ్యామ్ నుంచి రబీకి నీరు విడుదల



డొంకరాయి డ్యామ్ నుంచి నీటిని విడుదల చేస్తున్న సీఈ శ్రీధర్

మోతుగూడెం: ఉభయ గోదావరి జిల్లాలకు రబీ అవసరాల నిమిత్తం లోయర్ సీలేరు డొంకరాయి డ్యామ్ నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేస్తున్నట్టు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ బి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు డొంకరాయి డ్యామ్ గేట్లు ఎత్తి సోమవారం నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి అనంతరం మరో నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 7,500 క్యూసెక్కుల నీటిని రబీ అవసరాలకు గోదావరి జిల్లాలకు విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈవో అండ్‌ఎం వెంకటేశ్వరరావు, డీఈ బాలకృష్ణ, వరప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే



సమీక్షలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. తన చాంబర్‌లో సోమవారం వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పీవో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించి, మలేరియా జర్వాలు ఉన్నాయో లేదో నిర్ధారించాలని తెలిపారు. మలేరియా జర్వాలు ఉంటే మందులు అందజేయాలని తెలిపారు. పీహెచ్‌సీల వారీగా మలేరియా కేసుల నమోదు, మలేరియా కిట్ల పంపిణీపై సమీక్షించారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన మలేరియా కేసుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీల పరిధిలో గర్భిణుల వివరాలు, బర్త్ వెయిటింగ్ హాళ్లలో గర్భిణుల ఆరోగ్య విషయాలపై చర్చించారు. మారుమూల ప్రాంతంలో గల పీహెచ్‌సీల్లోని బర్త్ వెయిటింగ్ హాళ్లలో గర్భిణుల కోసం ఏసీలు, టీవీలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏడీఎంహెచ్‌వో జి. ప్రకాశం, ఏఎంవో నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌వో పీటర్ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులపై రాజకీయాలా?

- ఐదేళ్లుగా ఒకటో తేదీనే చేతికి పింఛన్
- తెల్లారేసరికే ఇంటి తలుపు తట్టిన వలంటీర్లు
- పచ్చమూక కుట్రతో పెన్షన్ల పంపిణీకి బ్రేకులు
- చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు
- పింఛన్ కోసం మండుటెండలో సచివాలయాలకు వెళ్లలేమంటున్న వృద్ధులు
- కూటమి అధికారంలోకి వస్తే తిప్పలు తప్పవని ఆందోళన
- మళ్లీ జగన్‌నే గెలిపించుకుంటామని ఉద్ఘాటన



కళ్లల్లో కాంతులు: ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందుకున్న వృద్ధురాలి ముఖంలో ఆనందం(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: సోమవారం వేకువజామున అవ్వా, తాతా అనే పిలుపు వినబడలేదు. సూర్యోదయానికి ముందే తలుపు తట్టిన శబ్దం రాలేదు. పొద్దెక్కుతున్నా ఆప్యాయంగా పలకరించే వలంటీర్ జాడ కనిపించలేదు. దీంతో ఈ రోజు ఒకటో తారీఖేనా? అంటూ ఒకటికి రెండుసార్లు సందేహ నివృత్తి చేసుకున్నారు. ఔనని నిర్ధారించుకున్న తరువాత.. మరి తెల్లారకుండానే పింఛన్ సొమ్ము చేతిలో పెట్టే వలంటీరు ఎందుకు రాలేదు? అంటూ ఇరుగు పొరుగు వారిని ఆత్రంగా ఆరా తీశారు. చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడ్డారంట.. ఆ బాబు పాలనలో మాదిరిగానే ఊళ్లో సచివాలయాలకెళ్లి పింఛన్ డబ్బు తీసుకోవాలంట.. ఇంటికి తెచ్చి ఇవ్వరంట.. అని చావు కబురు చల్లగా చెప్పగా పడుతూ లేస్తూ జీవనం సాగించే పండుటాకులు మండిపడుతున్నారు. మండుటెండల్లో సచివాలయానికి వెళ్లడం ఎలా? అంటూ ఆవేదన చెందుతున్నారు. వయసు మీరి కాళ్లు కదపలేని వారు.. ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టిన వారు.. ఏ ఆసరా లేని వారు.. మంచాన పడి కదల లేనివారు.. దివ్యాంగులు.. ఇలా ఎందరో పేద ముదుసలులు తమ పరిస్థితి ఏమిటంటూ ఉసూరుమంటున్నారు. చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ సొమ్మును వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఇంటికి తెచ్చి ఇస్తున్నారని.. కూటమి అధికారంలోకి వస్తే మునుపటిలా తమకు తిప్పలు తప్పవని భయాందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో మళ్లీ జగన్‌నే సీఎంగా గెలిపించుకుంటామని నెలనెలా ఠంఛనుగా పింఛన్ అందుకుంటున్న వారు ఉద్ఘాటిస్తున్నారు.

ఐదేళ్ల క్రితం పెన్షన్ రూ.వెయ్యే..

చంద్రబాబు హయాంలో అర్హులందరికీ కాకుండా ఏ కొద్దిమందికో పింఛన్ అందేది. అదీ అరకొరగానే. 2019 జనవరి వరకు నెలకు రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. ఈ సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రూ.2 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. వైఎస్ జగన్ హామీ మేరకు అధికారంలోకి వచ్చాక పింఛన్ సొమ్మును రూ.2,250 నుంచి నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచుతూ వచ్చారు. అదీ ఇంటికే తెచ్చి ఇచ్చే వ్యవస్థను తెచ్చారు. టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో (2019 ఎన్నికల ముందు వరకు) ప్రతి నెలా 4,22,335 మందికి రూ.75.83 కోట్లు చెల్లించేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు 5,61,336కి పెంచారు. నెలనెలా రూ.166.82 కోట్లు పంపిణీ చేస్తున్నారు.



హుకుంపేట మండలం కామయ్యపేటలో పింఛన్ పుస్తకాలతో నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధులు

నాడు అలా..

టీడీపీ పాలనలో ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	
అర్బన్ ప్రాంతంలో	1,16,789
గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతంలో	3,05,546
మొత్తం పింఛన్ల సంఖ్య	4,22,335
ప్రతినెలా చెల్లించిన మొత్తం	రూ.75.83 కోట్లు

నేడు ఇలా..

2019 తర్వాత వైఎస్సార్‌సీపీ హయాంలో	
ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పెన్షన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న సొమ్ము	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాల్లో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు

వలంటీర్లను అడ్డుకోవడం హేయమైన చర్య



పోలియో వ్యాధి కారణంగా వికలాంగుడైన నాకు వైఎస్ జగన్ ప్రభుత్వంలో మూడు చక్రాల వాహనం వచ్చింది. నాకు ప్రతినెలా వలంటీరు ద్వారా ఇంటికే రూ.3 వేలు పింఛను అందుతోంది. ఆ సొమ్ము నా కుటుంబ పోషణకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు కుట్రతో వలంటీరు సేవలను అడ్డుకోవడంతో ఈనెల పింఛన్లు ఆలస్యమయ్యాయి. మాలాంటి దివ్యాంగులు దూరంలోని సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవాలంటే ఇబ్బందులు పడాలి. వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా ప్రతిపక్షాలు అడ్డుకోవడం హేయమైన చర్య.

– మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, చింతూరు

చంద్రబాబు, పవన్‌లకు ఓటు వేయం



సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాకు రేషన్, పింఛన్ ఇంటి వద్దే అందిస్తున్నారు. మిలిగిన సంక్షేమ పథకాలు జగన్ నేరుగా బటన్ నొక్కి మా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న పింఛన్‌దాలపై కక్షకట్టిన ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ సేవలు అందకుండా అడ్డుకున్నాయి. మమ్మల్ని ఇబ్బందులు పాలు చేశాయి. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోమనడం దారుణం. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్న చంద్రబాబు, పవన్‌లకు ఓటు వేయం. వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేయాలి.

–కొర్ర చిన్నబాలన్న,డెంగ్రాయిపుట్టు, పెదబయలు మండలం

చంద్రబాబుది వంకర బుద్ధి



చేతి కర్ర లేనిదే నడవలేను. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాను. గతంలో పంచాయతీ కార్యాలయం చుట్టూ పది రోజులు తిరిగితే గాని పింఛన్ అందేది కాదు. అరకొర పింఛన్ కోసం ప్రతినెలా నరకం చూసేవాళ్లం. జగన్‌బాబు అధికారంలోకి వచ్చాక మా కష్టాలు తీరాయి. ఒకటోవ తేదీనే ఇంటి వద్దే వలంటీర్ పింఛన్ ఇస్తున్నారు. చంద్రబాబు వంకర బుద్ధి కారణంగా ఈ నెల పింఛన్ పంపిణీకి ఆటంకం ఏర్పడింది. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే నాకు ఇబ్బందే. ఈ రెండు నెలలు మా అవస్థలు ఏవో పడతాం. కానీ ఎన్నికల్లో జగన్ బాబుకు ఓటు వేసి గెలిపించి, ప్రతి నెల మాదిరిగానే వలంటీర్ ద్వారా ఇంటివద్దే పింఛన్ పొందుతాం.

– కట్టి కమల,బరడ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

కాళ్లు సహకరించవు.. కళ్లు కనిపించవు



నేను సరిగా నడవలేను, కళ్లు కనిపించడం లేదు. ఇంటికే పరిమితం అయ్యాను. ఈనెల పింఛన్ తీసుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లాలంటున్నారు. ఎలా వెళ్లాలో తెలియడం లేదు. మాకు ఇబ్బందులు కలిగించే వారికి తప్పనిసరిగా మా ఉసురు తగులుతుంది.

– ముక్కలి తౌడమ్మ, గూడెంకొత్తవీధి గ్రామం

ఇబ్బందులకు గురిచేయడం తగదు



నాకు సరిగా కనిపించదు. ఈ నెల పింఛన్ తీసుకోవాలంటే నా తండ్రి నన్ను సచివాలయానికి తీసుకెళ్లాలి. జగనన్న చలువతో ప్రతి నెలా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటివద్దే పింఛన్ తీసుకునేదాన్ని. ఇప్పుడు చంద్రబాబు కారణంగా ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇలా వృద్ధులను, దివ్యాంగులను కష్టాలపాలు చేయడం చంద్రబాబుకు, ప్రతిపక్షాలకు తగదు

– కించాయ బుల్లమ్మ, దివ్యాంగురాలు ,కిలగాడ, ముంచంగిపుట్టు మండలం

మళ్లీ ఇబ్బందులు పడాలా



గతంలోని పింఛన్లకోసం మైళ్లదూరం నడుచుకుని, పంచాయతీ కేంద్రాలకు వెళ్లేవాళ్లం.. మళ్లీ అలాంటి కష్టాలు పడాల్సివస్తోందనుకోలేదు. జగనన్న ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి, నాలాంటి ఎందరో వృద్ధులకు మేలు చేసింది. ఒకటో తేదీ ఉదయం ఐదు గంటలకే తలుపుతట్టి పింఛన్ అందించేవాళ్లు. చంద్రబాబు కుట్ర చేసి, వలంటీర్లను అడ్డుకున్నారు. పంచాయతీకి కార్యాలయానికి వెళ్లి ఈనెల పింఛన్ అందుకోవాలంటున్నారు. ప్రతిపక్షాల కారణంగా మళ్లీ ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– జన్ని సీతమ్మ, అనంతగిరి

ఎందుకింత కక్షసాధింపు



ప్రజలకు మంచి జరిగితే ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయి. గతంలో పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా జగనన్న చలువతో పింఛన్ల నేరుగా ఇంటివద్దనే అందుకుంటున్నాం. వయస్సు పైబడడంతో నేను నడవలేకపోతున్నాను. ఇప్పుడు పింఛన్ తీసుకోడానికి పంచాయతీకి కార్యాలయానికి వెళ్లమంటున్నారు. పింఛన్‌లబ్ధిదారులపై ఎందుకు అంతకక్షసాధింపు.

– పాంగి చంద్రన్న, అనంతగిరి

పాడేరు టీడీపీలో 'కిల్లు' లొల్లి

- గందరగోళంగా పార్టీ పరిస్థితి
- మూడు నెలల కిందట చేరిన వ్యక్తికి టికెట్ ఇవ్వడంపై మండిపాటు
- తీవ్ర అసంతృప్తితో నాయకులు
- బలప్రదర్శన చేసిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి
- తనకే టికెట్ కేటాయించాలని ర్యాలీ
- లేకుంటే టీడీపీ అభ్యర్థి రమేష్‌నాయుడుని ఓడిస్తానని హెచ్చరిక
- అయోమయంలో కేడర్



పాడేరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు: మూడు నెలల కిందట పార్టీలోకి వచ్చిన కిల్లు వెంకట రమేష్‌నాయుడుకు పాడేరు అసెంబ్లీ టికెట్ ఇవ్వడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులను వదిలేసి, నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వ్యక్తికి పైరవీలకు లొంగి టికెట్ ఇవ్వడం తగదని, పార్టీ అధిష్టానం నిర్ణయం మార్చుకోవాలని కొంతమంది సీనియర్ నాయకులు కోరుతున్నారు.లేకపోతే పాడేరులో టీడీపీ అభ్యర్థిని ఓడిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో పార్టీ కేడర్‌లో గందరగోళపరిస్థితి ఏర్పడింది. కనీసం ప్రచారంప్రారంభించ లేని స్థితిలోపార్టీ ఉంది.

గుర్రుగా సీనియర్లు

ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి మూడు నెలల కిందట టీడీపీలో చేరిన కిల్లు వెంకట రమేష్‌నాయుడుకు పాడేరు టికెట్ ఇవ్వడంతో పార్టీ సీనియర్లు మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, బొర్రా నాగరాజు, ఎం.వి.ఎస్. ప్రసాద్, వంజంగి కాంతమ్మ, కొట్టగుళ్లి సుబ్బారావు ప్రెస్‌మీట్ పెట్టి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుపై తీవ్ర వాఖ్యలు చేశారు. పాడేరు అసెంబ్లీ టికెట్‌ను అమ్ముకున్నారని, గిరిజనులంటే నారా చంద్రబాబు నాయుడికి చిన్న చూపని, గిరిజనుల మనోభావాలను చంద్రబాబు అర్థం చేసుకోలేరని తీవ్ర స్థాయిలో వాఖ్యనించారు. ఆందోళనలు నిర్వహించడంతో పాటు టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలను తగలబెట్టారు.

గిడ్డి ఈశ్వరి బలప్రదర్శన

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సోమవారం కుమ్మరిపుట్టులోని తన నివాసంలో నియోజకవర్గంలో ఐదు మండలాలకు చెందిన తన అనుచరులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పాడేరు పట్టణంలో బల ప్రదర్శన జరిపారు. టీడీపీ అభ్యర్థి రమేష్ నాయుడు వద్దు గిడ్డి ఈశ్వరి ముద్దు అంటూ నినాదాలు చేశారు. పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి గిడ్డి ఈశ్వరికి టికెట్ కేటాయించాలని లేని పక్షంలో టీడీపీ అభ్యర్థి రమేష్‌నాయుడును ఓడిస్తామని హెచ్చరించారు.

అయోమయంలో కేడర్

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొదటి నుంచి టీడీపీ నాయకులు వర్గాలుగా విడిపోయారు. ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ కొత్తగా పార్టీలోకి వచ్చిన కిల్లు వెంకట రమేష్‌నాయుడుకి అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. దీంతో ఇన్నాళ్లు వేర్వేరు వర్గాలుగా ఉన్న మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, బొర్రా నాగరాజు, ఎం.వి.ఎస్ ప్రసాద్, కొట్టగుళ్లి సుబ్బారావు, వంజంగి కాంతమ్మ కలిసి పోయి ఒక వర్గంగా ఏర్పడ్డారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మరో వర్గంగా ఉన్నారు. ఇక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు ఇంకో వర్గంగా ఉన్నారు. నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అసలే అంతంత మాత్రంగా ఉంది. దీనికి తోడు నాయకులు వర్గాలుగా విడిపోవడంతో ఉన్న కొద్దిపాటి కేడర్ కూడా ఎవరి వెనక ఉండాలో తెలియక అయోమయంలో ఉన్నారు. వర్గాలుగా ఉన్న టీడీపీ గ్రామాలను సందర్శించలేని పరిస్థితి నెలకొంది. తన వెంట పార్టీ క్యాడర్ లేకపోవడం, ఉన్నవారు సహకరించకపోవడంతో టీడీపీ అభ్యర్థి వెంకట రమేష్‌నాయుడు ఎన్నికల ప్రచారాన్ని ఇంకా ప్రారంభించలేదు.

వ్యక్తిగతంగా పింఛన్లు పంపిణీ చేస్తేనే మేలు

- ప్రభుత్వ సీఎస్‌కు కలెక్టర్ నివేదిక



సీఎస్ జవహర్‌రెడ్డి వీడియో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ విజయసునీత,డీఆర్‌డీఏ పీడీ మురళి

సాక్షి,పాడేరు: జిల్లాలో బ్యాంకులు తక్కువగా ఉన్నందున గిరిజన గ్రామాల్లో సామాజిక పింఛన్లను వ్యక్తిగతంగా పంపిణీ చేయిస్తేనే మంచిదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కలెక్టర్ విజయసునీత నివేదించారు. సోమవారం సీఎస్ నిర్వహించిన వీడియో సమీక్షలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీతో పాటు వేసవిలో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం తదితర అంశాలలో జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై సీఎస్ ఆదేశాలిచ్చారు. జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులతో ఇటీవల సమావేశాలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. శివారు గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టామని, బోరులకు అత్యవసరంగా మరమ్మతులు జరిపి వినియోగంలోకి తెచ్చేందుకు తగిన ఆదేశాలిచ్చామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణా, డీఈఈ ప్రకాశరావు,డీపీవో కొండలరావు పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

చింతపల్లిరూరల్: పాడేరు ఐటీడీఏ సహకారంతో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు దృష్టి ఐ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆప్తమాలజిస్ట్ గాలి జగన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, మెల్లకన్నుతోపాటు వివిధ కంటి సంబంధ సమస్యలున్న వారిని గుర్తించి, అవసరమైన వారికి వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఆయన కోరారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- అరకు ఎమ్మెల్యేగా మత్స్యలింగం, ఎంపీగా తనూజా రాణిని గెలిపించాలి
- వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర 8లో

చంద్రబాబు, పవన్‌లకు

ఓటుతో బుద్ధి చెబుతాం

- పింఛన్‌దారుల ఉసురు వారికి తగులుతుంది
- వలంటీర్ల సేవలు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్
- పలు ప్రాంతాల్లో వృద్ధుల ఆందోళన

పెదబయలు/హుకుంపేట: టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై వృద్ధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.వలంటీర్ల ద్వారా జరిగే పింఛన్ల పంపిణీని అడ్డుకుని తమను తీవ్ర అవస్థలకు గురిచేస్తున్న వారికి ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయడం నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెదబయలు, హుకుంపేట మండలాల్లో నిరసన వ్యక్తం చేశారు. పెదబయలు మండలం గోమంగి సచివాలయం పరిధిలో గోమంగి, గుల్లేలు పంచాయతీల్లో పింఛన్‌దారులు సచివాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. వలంటీరు వ్యవస్థ వచ్చిన తరువాత మేము సంతోషంగా ఉన్నామని, ప్రతి నెల ఒకటో తేదీన వలంటీరు వచ్చి పింఛన్ ఇచ్చే వారని తెలిపారు. చంద్రబాబు, పవన్‌లాంటి దొంగ నాయకులు అక్రమంగా ఫిర్యాదులు చేయించి వలంటీరుల సేవలు అందకుండా వృద్ధులు,వికలాంగులు,వితంతువులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని చెప్పారు. సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు నడిచివెళ్లి పింఛన్ తీసుకోవడం చాలా ఇబ్బందికరమన్నారు. వలంటీర్ల ద్వారానే ఇంటివద్ద పింఛన్ అందజేయాలని వృద్ధులు డిమాండ్ చేశారు.ఎన్ని కుట్రలు చేసిన మళ్లీ సీఎం జగన్ మోహన్ రెడ్డినే గెలిపిస్తామని ముక్తకంఠంతో చెప్పారు. హుకుంటపేట మండలం కామయపేట తో పాటు పలు గ్రామాల్లో వృద్ధులు ఆందోళన చేశారు. కామయ్యపేటలో పింఛన్ పుస్తకాలతో నిరసన వ్యక్తం చేశారు. ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన సీపీఎం నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలో గల వనుగుమ్మ పంచాయతీ కేంద్రానికి చెందిన సీపీఎం నాయకులు పాంగి శుక్ర, పాంగి గాసిరాం, కొర్ర మోహన్, వంతాల వెంకటరావు కుటుంబాలు సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు.వారికి అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంలు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన సీపీఎం నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామని, రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసేందుకు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, సర్పంచులు రమేష్, మిల్కి, బాబూరావు, నీలకంఠం, భాగ్యవతి, ఎంపీటీసీలు కమల, సోయిత, నబ్బో , నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నాయకులకు కండువా వేసి పార్టీలోకి చేర్పిస్తున్న పరిశీలకులు సుభద్ర,ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికే పెద్ద పీట వేశారని, జగనన్న సంక్షేమ పథాకాల ద్వారా పేదల కుటుంబాల్లో వెలుగును నింపారని రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని లక్కొండ, కొత్తాడ, సచివాలయల పరిధిలో లక్కొండ, గొరగొమ్మి, దొరమామిడి, పెదగార్లపాడు, చినగార్లపాడు, కొత్తాడ పునరావాస కాలనీ, సూరంపాలెం, వేమనాపల్లి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు చోట్ల ప్రసంగించారు.మండలంలో ప్రజా సంక్షేమానికి ఈ ఐదేళ్లలో రూ 135కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, అరకు ఎంపీగా తనూజ రాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

చంద్రబాబుకు పేదలంటే చులకన భావం

పేదప్రజలంటే చంద్రబాబు నాయుడికి చులకన భావమని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతుంటే వాటిని అడ్డుకోవడమే చంద్రబాబు లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి విమర్శించారు. సోమవారం రాత్రి పెదగార్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం



పెదగార్లపాడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడారు. జగనన్న పేదలను గుర్తించి వారికి ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా టిక్కెట్లు ఇస్తే వారిని చులకన భావంతో సోషల్ మీడియాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు గెలిచి ఏమీ సాధించారో, ప్రజలకు ఏమీ చేశారో చూపించి ఓట్లు అడిగే దమ్ములేదని ఆరోపించారు. ఈ ఐదేళ్ల కాలంలో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు ద్వారా ప్రతీ పేద కుటుంబ ఆర్థికంగా అభివృద్ధిని సాధించాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా అందిస్తున్న గ్రామ వలంటీర్లను టెర్రిస్టులుగా అభివర్ణించడం దారుణమన్నారు. కరోనా కష్టకాలంలో వాలంటీర్ వ్యవస్థ విశేషమైన సేవలు అందించిందన్నారు. ఆనాడు ఒక్క టీడీపీ కార్యకర్త కూడా ప్రజల్లో కనిపించలేదని ఎద్దేవా చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్ అందుకునే పేదవాడికి చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల నేడు పెన్షన్లు పొందలేని దౌర్భాగ్యపరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, కోఆప్షన్ సభ్యుడు కెఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్ధదొర ,మండల కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌ఛార్జ్ రఘునాథ్, సర్పంచ్‌లు కామరాజుదొర, లీలావతి, మాజీ సర్పంచ్‌లు పరదా వెంకటేశ్వరరావు, బూరుకట్ల నాగేశ్వరరావు, సంకురుదొర, జిల్లా కార్యదర్శి దిండి బాబి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, పొత్తు పార్టీలను ఓడించడమే ధ్యేయం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

చింతపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో బీజేపీ ,పొత్తు పార్టీలను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించడమే ధ్యేయంగా పెట్టుకున్నామని సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు.మండల కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో విలేకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చడమే లక్ష్యంగా పెట్టుకుని బిజెపి ముందుకు వెళుతుందన్నారు.ఇప్పటికే వ్యవస్థలన్నింటిని బీజేపీ నాశనం చేసిందని మండిపడ్డారు. పోత్తులు పెట్టుకున్న పార్టీలు ఏజెన్సీని సర్వనాశనం చేసేందుకు కుట్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ధనుంజయ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- అరకు ఎమ్మెల్యేగా మత్స్యలింగం, ఎంపీగా తనూజరాణిని గెలిపించాలి
- వైఎస్సార్‌సీపీ అరకు ఎన్నికల పరిశీలకులు, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: రాష్టాభివృద్ధి జగనన్న పాలనలోనే సాధ్యమని అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని మారుమూల వనుగుమ్మ పంచాయతీ సంగడ, దొడిపుట్టు పంచాయతీ తలబీరడ, బరడ పంచాయతీ కేంద్రంలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పాంగి పద్మరావు ఆధ్వర్యంలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం కూడా పాల్గొన్నారు. గ్రామాల్లో గిరిజనులు పూలమాలలు వేసి వీరికి బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గిరిజనులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీగా తనూజరాణిని, ఎమ్మెల్యేగా మత్స్యలింగంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. టీడీపీ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వారికి ఓట్లు వేయవద్దన్నారు. అరకు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన అభివృద్ధి చేసి చూపిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అన్ని వర్గాలకు జగనన్న సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని పేర్కొన్నారు. మళ్లీ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. మీరంతా రానున్న ఎన్నికల్లో రెండు బటన్‌లను నొక్కి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, మండల జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, సర్పంచులు రమేష్, మిల్కి, వసంత, పార్వతమ్మ, బాబూరావు, నీలకంఠం, భాగ్యవతి, ఎంపీటీసీలు నబ్బో, సోయిత, కమల, పార్వతమ్మ, కొండమ్మ, జిల్లా నేత సూర్యనారాయణ, మండల నేతలు మత్స్యలింగం, రామ్మూర్తి, అర్జున్, అప్పారావు, జగన్నాథం, తిరుపతి, సన్యాసిరావు, రాంప్రసాద్, పులిరాజు, సుందర్‌రావు, దాసు, పరశురాం, జగబంధు, విక్రమ్, సీతారాం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధం అంటున్న బరడ గ్రామ గిరిజనులు

544 కిలోల గంజాయి స్వాధీనం

- చీడిపాలెం జంక్షన్లో రూ.27 లక్షల గంజాయి పట్టివేత
- వీరవరం నుంచి తునికి తరలిస్తుండగా స్వాధీనం
- ఏడుగురు అరెస్ట్, ముగ్గురు పరారీ
- జీపుతోపాటు రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు ఫోన్లు స్వాధీనం

కొయ్యూరు: చింతపల్లి మండలం వీరవరం నుంచి తునికి తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు సీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్‌ఐ రామకృష్ణ, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, అదనపు ఎస్‌ఐ బి.దేముడు తెలిపారు. సోమవారం విలేకరులకు తెలిపిన వివరాలు.. ఆదివారం సాయంత్రం చీడిపాలెం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మొదట రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న వారిని ఆపి వారి ఫోన్లను పరిశీలించారు. వెంటనే వారి వెనుకగా వస్తున్న జీపును ఆపి తనిఖీ చేయగా అందులో పది బస్తాల్లో దాచిన 544 కిలోల గంజాయిని గుర్తించారు. దీన్ని కిలో రూ.1,200 చొప్పున ఒడిశాలోని చింతలదూరి గ్రామంలో కొనుగోలు చేసినట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. కొనుగోలు చేసిన దానిని కొండ మార్గంలో చింతపల్లి మండలం వీరవరం వరకు కాలి నడకన తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు జీపులో తుని తరలించే ప్రయత్నంలో పోలీసులకు చిక్కారు. ముందస్తు సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా జీపులో ఉంచిన గంజాయి దొరకినట్లు పోలీసులు తెలిపారు. గంజాయితో దొరికిన వారిలో గతంలో మూడు సార్లు జైలుకు వెళ్లిన చింతపల్లి మండలం, అన్నవరానికి చెందిన సీందరి సూరిబాబుతోపాటు గూడెం మండలం కొత్తవాడకు చెందిన పాంగి ప్రసాద్, మొండిగెడ్డ పంచాయతీ బూరుగుపాకలకు చెందిన కిల్లో బాలరాజు(జీపు డ్రైవర్), కొత్తవాడకు చెందిన వంతల శివయ్య, అదే గ్రామానికి చెందిన కొర్రా గిరి, కోరుకొండకు చెందిన రీముల ప్రశాంత్ ఉన్నట్లు వెల్లడించారు. మరొకరు మైనర్ బాలుడని తెలిపారు. జెర్రెల కొత్తూరుకు చెందిన పాంగి ధర్మ, పాంగి సత్తిబాబు, నర్సీపట్నంకు చెందిన నోట్ల చిన రామకృష్ణ తప్పించుకున్నట్లు పేర్కొన్నారు.



పోలీసులు అరెస్ట్ చేసిన గంజాయి స్మగ్లర్లు

అంతా నృసింహమయం

- సింహగిరిపై వైభవంగా ముగిసిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం
- విశేషంగా మహా పూర్ణాహుతి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: నృసింహస్వామి నామస్మరణతో సోమవారం సింహగిరి హోరెత్తింది. వేద మంత్రోచ్ఛరణలు, దివ్యప్రబంధ పారాయణాలతో ప్రజ్వరిల్లింది. సింహగిరిపై ఏడు రోజులుగా జరిగిన శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం సోమవారంతో ముగిసింది. భక్తులు విశేషంగా పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉదయం 6గంటల నుంచి వైదిక కార్యక్రమాలను దేవస్థానం అర్చకులు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్‌ను యాగశాల్లో వేంజేంపచేసి యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించారు. తదుపరి ధ్వజావరోహణాన్ని నిర్వహించారు. అనంతం యజ్ఞంలో ఉంచిన ప్రధాన కలశని దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై పెట్టుకుని యజ్ఞశాల నుంచి తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతం మళ్లీ యజ్ఞశాలకు ప్రధాన కలశను తీసుకొచ్చారు. ఆ జలాలను స్వామికి సమర్పించారు. అనంతరం భక్తులపై ఆ జలాలను చల్లారు. తదుపరి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ శతకం, దివ్యప్రబంధ పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు. స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా శాంతి కల్యాణం

నృసింహ యజ్ఞం ముగింపులో భాగంగా శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

నృసింహ యజ్ఞం నిర్వహణ భేష్

లోకకల్యాణం కోసం సింహగిరిపై ఏడు రోజులపాటు సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించడం చాలా గొప్ప విశేషమని శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. మహా పూర్ణాహుతి అనంతరం ఆయన అనుగ్రహభాషణం చేశారు. అన్ని క్షేత్రాల్లో సింహాచలం క్షేత్రం ఎంతో విశిష్టమైనదని, ఇక్కడ ఉన్న ఆచారసంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. అలాంటి క్షేత్రంలో వైదికపరంగా, సంప్రదాయపరంగా వైదికులు యజ్ఞాన్ని నిర్వహించి పుణ్యఫలం సమాజానికి అందించారన్నారు.



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వాత్మానందేంద్ర సరస్వతి

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి

అరకులోయ రూరల్: బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలో బొండం పంచాయతీ రేగ గ్రామనికి చెందిన గ్రామ వలంటీర్ పాంగి చిట్టిబాబు ఇలు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీ అభ్యర్థి తనుజరాణి, సోమవారం పార్టీ శ్రేణులు కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయమందించారు. జరిగిన సంఘటనపై బాధిత కుటుబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో రూ.85వేల నగదు, నిత్యావసర సరకులు అన్ని కాలిబూడిదైనట్టు బాధితులు వాపోయారు. దీనిపై స్పందించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధైర్యపడొద్దని, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని అనారోగ్యంతో మృతి చెందిన కొర్రా రత్నకుమారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహమూర్తి, జిల్లా మహిళ విభాగం అధికార ప్రతినిధి కొర్రా రాధిక, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, సర్పంచ్ భాస్కర్‌రావు, కన్వీనర్ రాధ, నాయకులు శ్రీను, అప్పలస్వామి, గురు, నగేష్, గెన్ను తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సమచారం ఇస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీ అభ్యర్థి తనుజరాణి

నాటు తుపాకీలు అప్పగింత

దేవీపట్నం: జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి సూచనలతో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నాటు తుపాకులు స్వచ్ఛందంగా అప్పగించాలని ఇచ్చిన సమాచారం మేరకు నాటు తుపాకీలు అప్పగిస్తున్నారని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరావు తెలిపారు. దేవీపట్నం మండలం చిన్నారి గండి గ్రామానికి చెందిన వ్యక్తులు నాలుగు నాటు తుపాకులను సోమవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులకు అప్పగించారు. ఆయన వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఇంకా ఎవరి వద్దనైనా నాటు తుపాకులు ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఎటువంటి కేసులు నమోదు చేయమన్నారు. ఎస్ఐ నాగార్జున ఉన్నారు.



నాటు తుపాకులను చూపుతున్న సీఐ వెంకటేశ్వరరావు

వేసవిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా


సాక్షి,పాడేరు: వేసవిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురయ్యేవారికి సత్వరం వైద్య సేవలందించేందుకు ప్రభుత్వ సీఎస్ జవహర్‌రెడ్డి, కలెక్టర్ విజయ సునీతల ఆదేశాల మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో తగిన ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు వైద్యసేవలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. బస్‌స్టాండ్‌లు, ప్రధాన జంక్షన్‌లు, వారపుసంతలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ప్రజలకు పంపిణీ చేసే విధంగా పీహెచ్‌సీల వైద్యులు, సంబంధిత ఏఎన్‌ఎంలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చిన్నపిల్లలు, వృద్ధులను వైద్యసిబ్బంది పరిశీలించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి, వాటి వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. 108,104 వాహనాల్లో కూడా పూర్తిస్థాయిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురయితే 108 వాహనాల ద్వారా సకాలంలో ఆస్పత్రులకు తరలించాలని పేర్కొన్నారు. వేసవిలో సురక్షిత తాగునీటిని సేవించడంతో పాటు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అతి తీవ్రమైన ఎండలో పనిచేసే రైతులు,వ్యవసాయ కూలీలు,ఇతర కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సురక్షిత ప్రాంతాలలో విశ్రాంతి తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు.



డాక్టర్ జమాల్‌బాషా

విజయమే లక్ష్యంగా డీసీ, కేకేఆర్ జట్ల ప్రాక్టీస్






నెట్ ప్రాక్టీస్‌లో డీసీ, కేకేఆర్ జట్ల క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: ఆతిథ్య జట్టుకు అచ్చివచ్చిన స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) మరో విజయానికి సిద్ధపడుతుండగా... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) హ్యాట్రిక్ సాధించాలనే పట్టుదలతో విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలో సోమవారం రాత్రి ప్రాక్టీస్ చేశాయి. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన డీసీ వైఎస్సార్ స్టేడియంలో సీఎస్‌కే మ్యాచ్‌లో విజయం సాధించింది. బుధవారం ఆడే రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించేందుకు శ్రమిస్తోంది. మంగళవారం కూడా ఇరుజట్లు ప్రాక్టీస్ చేయనున్నాయి. ఇరుజట్ల మధ్య పోరు బుధవారం రాత్రి ఏడున్నర గంటలకు మ్యాచ్ జరగనుంది. శ్రేయాస్ అయ్యర్ సారధ్యంలో కేకేఆర్ జట్టు పోటీకి సిద్ధపడుతుండగా ఓపెనర్లుగా ఫిల్, నరేన్‌లుతో పాటు వెంకటేష్ అయ్యర్ సైతం విజయమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రమాదం నుంచి కోలుకొని సీఎస్‌కే మ్యాచ్‌లో అర్ధసెంచరీతో రాణించడమే కాకుండా జట్టును విజయపథంలో నడిపిన రిషబ్ పంత్ తన ఫామ్‌ను కొనసాగించేందుకు శ్రమిస్తున్నాడు. ఇలా ఇరు జట్లు ఆత్మవిశ్వాసంతో మరోసారి విశాఖ క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి.

ఆత్మీయ సన్మానం

కూనవరం: ఏపీ ప్రెస్ అకాడమీ రాష్ట్ర కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆయన స్వగ్రామం కూనవరంను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలగంగాధర్ తిలక్, ఉషారాణి దంపతు లను స్థానిక భాస్కర్ టాకీస్ యజమాని తిలక్, భూపేష్, జయబాబు వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. డీవీ రమణ, బాబూరావు, లో కేష్, రమేష్, వెంకటేష్, వెంకట్, నవీన్, వినయ్‌ప్రసాద్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



బాలగంగాధర్ తిలక్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం